సాక్షి
నిజామాబాద్
ఆదివారం । 18 । మే । 2025



వరి కొయ్యలను..

వరి కోతల అనంతరం మిగిలిన అవశేషాలను (కొయ్యలను) కాల్చొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

- 8లో ▸



ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే..

ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే వరకు న్యాయ పోరాటం చేద్దామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు.

- 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0 /23.9

ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశాలున్నాయి.

న్యూస్‌రీల్

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు



నిజామాబాద్‌అర్బన్: ధాన్యం కొనుగోళ్లలో జాప్యం చేయొద్దని ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన సమీక్షా సమావేశం నిర్వహించారు. ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియలో ఎందుకు జాప్యం జరుగుతోందని, ప్రధాన సమస్యలు ఏమిటని అధికారులను మహేశ్‌కుమార్‌గౌడ్ అడిగి తెలుసుకున్నారు. అకాల వర్షాల కారణంగా తడిసిన ధాన్యం, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తదితర వివరాలు తెలుసుకున్నారు. పారాబాయిల్డ్ రైస్ శాతాన్ని పెంచే విధంగా రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో మాట్లాడారు. ధాన్యం కొనుగోలుకు సంబంధించి రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు తదితరులు పాల్గొన్నారు

8.01లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ

- రూ.1,604 కోట్లు రైతుల ఖాతాల్లో జమ



సుభాష్‌నగర్: జిల్లాలో యాసంగి సీజన్‌లో 601 కొనుగోలు కేంద్రాల ద్వారా 93,974 మంది రైతుల నుంచి 8.01 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించినట్లు జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి (డీఎస్‌వో) అరవింద్‌రెడ్డి శనివారం తెలిపారు. 7.15లక్షల మెట్రిక్ టన్నుల సన్నరకాలు కాగా, 85,739 మెట్రిక్ టన్నులు దొడ్డురకాలను సేకరించామని వివరించారు. రూ.1867.64 కోట్ల విలువైన ధాన్యాన్ని కేంద్రాల ద్వారా సేకరించామని, 86,339 మంది రైతుల ఖాతాల్లో రూ.1604 కోట్లు జమ చేశామన్నారు. చివరి గింజ వరకూ ధాన్యం సేకరించాలని ప్రభుత్వం ఆదేశించిందని, ఆ మేరకు అదనపు కలెక్టర్ కిరణ్‌కుమార్ పర్యవేక్షణలో కొనుగోళ్లు చేపడుతున్నామని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులు విక్రయించిన ధాన్యానికి సంబంధించి బోనస్ డబ్బులు త్వరలోనే జమవుతాయని, రైతులెవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

గుండెపోటుతో 16ఏళ్ల బాలుడు మృతి




వడ్ల శివ (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్): గుండెపోటుతో పదహారేళ్ల బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన డొంకేశ్వర్ మండలం నికాల్‌పూర్ గ్రామంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వడ్ల శివ ఇటీవల స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసి గ్రేడ్‌-ఏ ఉత్తీర్ణత సాధించాడు. తండ్రి గంగన్న చిన్నతనంలోనే చనిపోగా తల్లి సరిత కూలీ పనులు చేస్తూ కొడుకును పోషిస్తోంది. పేద కుటుంబ కావడంతో బాగా చదివి కుటుంబానికి అండగా ఉండాలని శివ అనుకునేవాడు. గ్రామంలోనే పని చేస్తూ చదువుకునేవాడు. శనివారం ఉదయం తీవ్రమైన దగ్గు కారణంగా శివ గుండెపోటుకు గురయ్యాడు. స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా మరణించాడు. దీంతో తల్లి సరిత గుండెలవిసేలా రోదించింది. బాలుడి మరణంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. గ్రామస్తులు, యువకులు విరాళాలు పోగుచేసి బాధిత కుటుంబానికి రూ.లక్ష వరకు అందజేశారు.

ఇందూర్‌లో భావ్‌సర్‌లు

బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా అవతరించాలని భారత ప్రజలు ముఖ్యంగా భావ్‌సర్(రంగరి) క్షత్రియులు బలంగా కోరుకుంటున్నారు. బలూచ్ ప్రాంతంలోని అమ్మవారి శక్తిపీఠాన్ని స్వేచ్ఛగా సందర్శించే అవకాశం కలుగుతుందని ఆశించడమే అందుకు ప్రధాన కారణం. విభజన సమయంలో బలూచ్ ప్రాంతాన్ని వీడి వచ్చిన భావ్‌సర్ క్షత్రియ సమాజ్ దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ఇందూరులో వేయి కుటుంబాలకు పైగా ఉండగా, వారుతమ ఆరాధ్య దైవం హింగులా మాత ఆలయాన్ని నిర్మించి ప్రత్యేకంగా కొలుస్తున్నారు.

- నగరంలో హింగులామాతకు ఆలయం
- భావ్‌సర్ క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 1982లో నిర్మాణం
- దేశ విభజన సమయంలో ఇక్కడికి రాక
- ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో హింగులా శక్తిపీఠంపై ఆసక్తి
- బలూచిస్తాన్ ప్రత్యేక దేశం కావాలని బలంగా కోరుకుంటున్న ప్రజలు



ఇందూరులోని ఆలయంలో హింగులాంబిక అమ్మవారు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో పాక్ ఆక్రమిత కశ్మీర్ కన్నా ఎక్కువగా ఆ దేశానికి నైరుతిభాగంలో ఉన్న బలూచిస్తాన్ అంశంపైనే దేశ వ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పాకిస్తాన్ నుంచి విడిపోయి స్వతంత్ర దేశంగా కొనసాగేందుకు బలూచిస్తాన్ తగిన ఏర్పాట్లు చేసుకుంటుండగా, భారతదేశంలోని ప్రతిఒక్కరూ ప్రత్యేక బలూచిస్తాన్ దేశం కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అయితే భారతదేశ విభజన సమయంలో బలూచిస్తాన్ ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చిన భావ్‌సర్ క్షత్రియ సమాజ్ వారు మాత్రం మరింత ఆసక్తిగా, బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా అవతరించాలని బలంగా కోరుకుంటున్నారు. తమ మూల స్థానమైన బలూచ్‌లో కొలువై ఉన్న హింగులా మాతను మొక్కుకుంటున్నారు. అఖండ భారత్‌లో భాగమైన బలూచ్ ప్రాంతంలోని అమ్మవారి శక్తిపీఠాన్ని స్వేచ్ఛగా సందర్శించే అవకాశం కలగాలని కోరుకుంటున్నారు. అమ్మవారి 52 శక్తి స్వరూపాల్లో ఒకటైన హింగులాదేవి ప్రధాన ఆలయం పాకిస్తాన్‌లోని బలూచిస్తాన్‌లోని హింగోల్ నేషనల్ పార్క్‌లో ఉంది. కరాచీకి 90 కిలోమీటర్ల దూరంలో హింగుల పర్వతంపై హింగోసీ నదీతీరం ఈ శక్తిపీఠానికి మూలస్థానం. హింగుళా మాత అసలు పేరు కోటరి. హింగుల పర్వతంపై ఉండడంతో హింగుళాదేవిగా ప్రసిద్ధి పొందింది. ఈ పర్వతంపై గుహలో హింగులామాత నిత్యం జ్వలిస్తూ దర్శనమిస్తోంది. ప్రకృతి నిర్మిత గుహ ఆలయంలో అమ్మవారు దర్శనమిస్తున్నారు. శ్రీకృష్ణదేవరాయల ఆస్థాన అష్టదిగ్గజాల్లో ఒకరైన అల్లసాని పెద్దన రచించిన మనుచరిత్రలో హింగులాదేవి ప్రస్తావన ఉంది. ఇంతటి ప్రాచీన చరిత్ర కలిగిన శక్తిస్వరూపిణి ఆలయాన్ని ఇందూరు నగరంలో భావ్‌సర్ క్షత్రియ సమాజ్ (రంగరి) (వస్త్రాలకు రంగులు వేసే) ఆధ్వర్యంలో 1982లో నిర్మించారు.



నిజామాబాద్ నగరంలో హింగులాంబిక మాత ఆలయం



ఇందూరు హింగులా మాత

ఇందూరులోని హింగులా మాత ఆలయంలో ప్రతిరోజూ అభిషేకం, ప్రతి మంగళవారం భజనలు, ప్రతి పౌర్ణమికి యజ్ఞం, సత్యనారాయణ స్వామి వ్రతం, అన్నదానం నిర్వహిస్తున్నారు. దసరా నవరాత్రులు నిర్వహిస్తున్నారు. ఇందూరులో ఊరపండుగ అయ్యాక వారం రోజుల తరువాత పసుపు, కుంకుమ, కాగడాలతో పాటలు పాడుతూ గోందాల్ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు.

దేశవిభజన సమయంలో ఇక్కడికి..

దేశవిభజన సమయంలో రంగరి (భావ్‌సర్ క్షత్రియ సమాజ్) కులస్తులు బలూచిస్తాన్ ప్రాంతం నుంచి రాజస్తాన్‌కు వలస వచ్చారు. ఆ తరువాత దేశంలోని వివిధ ప్రాంతాల్లో స్థిరపడ్డారు. ప్రస్తుతం నిజామాబాద్ జిల్లాలో ఈ సమాజ్ కు చెందిన వేయికి పైగా కుటుంబాలు ఉన్నాయి. పురాణాల ప్రకారం క్షత్రియులుగా ఉన్న వీరిని అంతమొందించేందుకు పరశురాముడు వెంటాడితే వీరి వంశీయులు దేవీమాత శరణు కోరగా హింగులాదేవి కాపాడి వస్త్రాలకు రంగులు అద్దే కళను కటాక్షించింది. అప్పటి నుంచి ఈ వృత్తిని చేస్తున్నట్లు ఈ సమాజ్ పెద్దలు తెలిపారు.



ఆలయంలోని ధ్వజస్తంభం

శిరోపీఠంగా ప్రసిద్ధి



హింగులా మాత కొలువై ఉన్న ప్రాంతం అఖండ శక్తి తరంగాలతో నిండినట్లుగా భావిస్తారు. హింగుళ ప్రాంతంలో శక్తి స్వరూపిణి అయిన అమ్మవారి శిరస్సు పడడంతో ఇది శిరోపీఠంగా ప్రసిద్ధి చెందింది. హింగుల పర్వతంలోని గుహ ఆలయంలో ప్రతిష్ఠిత విగ్రహం లేదు. అక్కడ ఉన్న శిల అమ్మవారి శక్తి స్వరూపంగా భావించబడుతోంది. భక్తులు ఆ శిలపై చందనం, కుంకుమతో పూజలు చేస్తున్నారు. అలాగే ముస్లింలు, జిక్రీ మతస్తులు పూజలు చేస్తున్నారు. వారు హింగులా (హింగ్లాజ్) మాతను 'నానీ మాంఘే' అని గౌరవంగా పిలుచుకుంటారు.

– మైస్కర్ విజయలత చంద్రకాంత్ బరిడే,
భావ్‌సర్ క్షత్రియ సమాజ్ అధ్యక్షురాలు, ఇందూరు

గుండెల్లోనే హింగులామాత



హింగులా మాత శక్తి పీఠం భౌతికంగా భారతదేశానికి బయట ఉన్నప్పటికీ, ఆధ్యాత్మిక శ్రద్ధా చింతనల దృష్ట్యా అమ్మవారు అందరి గుండెల్లో కొలువై ఉన్నారు. ఇది హిందూ ధర్మంలోని శక్తితత్వానికి, భక్తి బలానికి నిలువుటద్దం. బలూచిస్తాన్ ప్రత్యేక దేశంగా ఆవిర్భవిస్తే భారతీయులందరూ హింగుళా మాత శక్తిపీఠాన్ని ఎప్పుడంటే అప్పుడు దర్శించుకునే అవకాశం లభిస్తుంది. ఇది భారతీయులందరికీ మరింత హర్షదాయకం.

– భోక్రే నారాయణ,
భావ్‌సర్ క్షత్రియ సమాజ్ సభ్యుడు

బీఆర్‌ఎస్‌లో మూడు ముక్కలాట

- మతం పేరుతో బీజేపీ రాజకీయ లబ్ధి పొందుతోంది
- టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్



ఆర్ అండ్ బీ అతిథి గృహంలో మాట్లాడుతున్న టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్‌గౌడ్

నిజామాబాద్ రూరల్: కవిత, కేటీఆర్, హరీశ్‌రావు పోరుతో బీఆర్‌ఎస్‌లో మూడు ముక్కలాట నడుస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. వారి పోరుతాళలేక కేసీఆర్ ఫాంహౌస్‌కు పరిమితమయ్యారన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బీ అతిథి శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో ఉనికి కోసం ఆరాటపడుతుందని ఎద్దేవా చేశారన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ఆడుతున్న ముడు ముక్కలాట పోరు తాళలేక కేసీఆర్ ఫాం హౌస్‌కు పరిమితం అయ్యారన్నారు. వచ్చే ఎన్నికల నాటికి తెలంగాణ రాజకీయ ముఖచిత్రంలో బీఆర్‌ఎస్ కనపడదన్నారు. మతం పేరుతో రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం బీజేపీకి పరిపాటిగా మారిందన్నారు. పాక్‌పై యుద్ధంతో సాధించింది ఏమిటి? కోల్పోయింది ఏమిటి? అన్న విషయంపై కేంద్రం క్లారిటీ ఇవ్వడం లేదని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందని, దేశంలోనే రాష్ట్రాన్ని రోల్ మోడల్‌గా తీర్చిదిద్దుతామన్నారు. పార్టీలోని కొత్త, పాత నేతల మధ్య సమన్వయంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని పేర్కొన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ నేతలు దిగజారి కాంగ్రెస్‌పై సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారని అన్నారు. మధ్యప్రదేశ్ తరహాలో సోషల్ మీడియాలో విష ప్రచారాన్ని అడ్డుకునేందుకు క్షుణ్ణంగా అధ్యయనం చేసి చట్టం తెచ్చే యోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. సమావేశంలో రాష్ట్ర వ్యవసాయ కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, నుడా చైర్మన్ కేశ వేణు, కాంగ్రెస సీనియర్ నాయకులు మునిపల్లి సాయారెడ్డి, విపుల్‌గౌడ్ తదితరులు పాలొన్నారు.

పశువుల అక్రమ రవాణా నిరోధానికి చర్యలు

- అధికారులు సమన్వయంతో పనిచేస్తూ సమస్యలు తలెత్తకుండా చూడాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, సీపీ సాయిచైతన్య



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పక్కన సీపీ సాయి చైతన్య

నిజామాబాద్ అర్బన్ : పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు నిఘా కొనసాగించాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు, పోలీస్ కమిషనర్ పీ సాయి చైతన్య అధికారులను ఆదేశించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో జంతు సంక్షేమం, గోవధ నిషేధంపై జిల్లాస్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్, సీపీ మాట్లాడుతూ బక్రీద్‌ను దృష్టిలో పెట్టుకొని జంతు సంక్షేమం కోసం ఉద్దేశించిన చట్టాల ఉల్లంఘన జరగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో గోవులతోపాటు ఒంటెలు వధించకుండా నిషేధం అమలులో ఉందని తెలిపారు. దీనిపై ప్రజలకు విస్తతస్థాయిలో అవగాహన కల్పిస్తూ, గోవులు, ఒంటెలను వధించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పశువులను స్లాటర్ హౌస్‌లలోనే వధించాలని, రోడ్లపై ఎక్కడపడితే అక్కడ వధించరాదని సూచించారు. పశువుల అక్రమ రవాణాను నిరోధించేందుకు జిల్లాలోని కందకుర్తి, సాలూర, పోతంగల్, ఖండ్‌గావ్ అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులతోపాటు, సాటాపూర్, యంచ, ఇందల్వాయి, ఉమ్మెడ, జన్నెపల్లి, మామిడిపల్లి తదితర ప్రాంతాల వద్ద ప్రత్యేకంగా అంతర్ జిల్లా చెక్‌పోస్టులను ఏర్పాటు చేస్తున్నామని సీపీ తెలిపారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం పర్యవేక్షణ జరపాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. పశువుల వారాంతపు సంతలలో నిబంధనలకు అనుగుణంగా క్రయవిక్రయాలు జరిగేలా చూడాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా శాంతియుత వాతావరణంలో బక్రీద్ వేడుక జరిగేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో, నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, జిల్లా రవాణా శాఖ అధికారి ఉమామహేశ్వర రావు, ట్రాన్స్‌కో ఎస్ఈ రవీందర్, నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ ఏసీపీలు రాజా వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, వెంకటేశ్వర్ రెడ్డి, పశు సంవర్ధక, పంచాయతీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాయబ్ తహసీల్దార్ల బదిలీ

నిజామాబాద్ అర్బన్: గత సార్వత్రిక ఎన్నికల్లో ఇతర జిల్లాలకు బదిలీ అయిన నాయబ్ తహసీల్దార్లను ప్రభుత్వం ఎట్టకేలకు పూర్వ జిల్లాకు బదిలీ చేసింది. ఈ మేరకు శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలో పనిచేస్తున్న వారు ఇతర జిల్లాకు వెళ్లగా, ఇతర జిల్లాలో పనిచేస్తున్న వారు నిజామాబాద్‌కు రానున్నారు.

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ అయిన స్థానం
బీ విజయ్‌కాంత్‌రావు	ఆదిలాబాద్	నిజామాబాద్
అబ్దుల్ అజీజ్	నిర్మల్	నిజామాబాద్
దీపారాణి	నిర్మల్	నిజామాబాద్
రంజిత్‌కుమార్	నిర్మల్	నిజామాబాద్
మునీరుద్దీన్	నిర్మల్	నిజామాబాద్
ఖాజా అబ్దుల్ మాజీద్	జగిత్యాల్	నిజామాబాద్
బీ రాజశేఖర్	జగిత్యాల	నిజామాబాద్
కార్తిక్ రెడ్డి	జగిత్యాల	నిజామాబాద్
వినోద్ కుమార్	జగిత్యాల	నిజామాబాద్
వీ గంగాధర్	నిజామాబాద్	నిర్మల్
ఎం తెలంగ్రారావ్	నిజామాబాద్	నిర్మల్
జే ప్రకాశ్	నిజామాబాద్	నిర్మల్
బాబూసింగ్	నిజామాబాద్	నిర్మల్
పీ హరీశ్‌కుమార్	నిజామాబాద్	నిర్మల్
ఎస్ విష్ణువర్ధన్	నిజామాబాద్	నిర్మల్
కే పద్మ	నిజామాబాద్	నిర్మల్

సైనికులకు సంఘీభావంగా తిరంగా ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

- రేపు ఇందూరులో చేపట్టే ర్యాలీని ప్రజలు విజయవంతం చేయాలి
- అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్

సుభాష్‌నగర్: ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా భారత సైనికుల ఘన విజయాన్ని పురస్కరించుకుని ఇందూరులో ఈ నెల 19న నిర్వహించే తిరంగా ర్యాలీలో ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ పిలుపునిచ్చారు. సిటిజన్స్ ఫర్ నేషనల్ సెక్యూరిటీ కన్వీనర్ జీవీ కృపాకర్‌రెడ్డి అధ్యక్షతన నగరంలోని సుభాష్‌నగర్‌లో ఉన్న అర్బన్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. పహల్గాం ఘటనలో ఉగ్రవాదులు భారతీయులపై చేసిన హత్యాకాండను దేశం ఎన్నటికీ మర్చిపోదని పేర్కొన్నారు. ఆ ఘటనకు బదులుగా ప్రధాని మోదీ ఆదేశాలతో భారత సైన్యం ఆపరేషన్ సిందూర్ చేపట్టి ఉగ్రవాద స్థావరాలపై దాడులు చేసి వందమందికిపైగా ఉగ్రవాదులను మట్టుబెట్టడం గర్వకారణమన్నారు. ఆకాశ్ తీర్, బ్రహ్మోస్, సుదర్శన్‌–400 వంటి ఆధునిక రక్షణ వ్యవస్థలతో పాకిస్తాన్ డ్రోన్లను గాలిలోనే తరిమికొట్టిన తీరు ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చిందని కొనియాడారు. ఈ విజయానికి గుర్తుగా మన మూ.. దేశం కోసం నినాదంతో భారీ తిరంగా ర్యాలీని నిర్వహిస్తున్నామని తెలిపారు. 19న సాయంత్రం 4 గంటలకు రాజరాజేంద్ర చౌరస్తా నుంచి గాంధీ చౌక్ వ రకు నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో నాయకులు ఓం ప్రకాశ్ దైమా, డాక్టర్ వెంకటరమణ, యాదగిరి, నరసింహ, గజం ఎల్లప్ప, బుస్సాపూర్ శంకర్, పంచరెడ్డి ఎర్రన్న పాల్గొన్నారు.

రూ.81 కోట్లకు వ్యాపారి ఐపీ!

నిజామాబాద్ రూరల్: మండలంలోని పాల్దా శివారులో ప్లాస్టిక్ బ్యాగులు తయారు చేసే ఫ్యాక్టరీ యజమాని రూ.81 కోట్లకు ఐపీ పెట్టినట్లు తెలిసింది. దీంతో అతనికి రూ. లక్షల్లో అప్పులు ఇచ్చిన బాధితులు లబోదిబోమంటున్నారు. ఈ విషయమై రూరల్ ఎస్‌హెచ్‌వోను వివరణ కోరగా ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు.

టీఎన్జీవోస్‌లో కారు రగడ

- సంఘం నిధులు రూ.34 లక్షలతో కొనుగోలు
- సభ్యత్వ నిధుల వినియోగంపై ఉద్యోగుల మండిపాటు



నిజామాబాద్ అర్బన్: టీఎన్జీవోస్‌లో కారు కొనుగోలు రగడ కొనసాగుతోంది. రాష్ట్రంలో ఎక్కడా లేనివిధంగా జిల్లాలో టీఎన్జీవోస్ అధ్యక్షుడు సభ్యత్వ రుసుము నిధులతో కారు కొనుగోలు చేయడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉద్యోగుల సమస్యలపై పోరాటానికి, కార్యవర్గ బలోపేతానికి ఉపయోగించాల్సిన నిధులతో వాహనం కొనుగోలు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇటీవల జరిగిన ఈసీ మీటింగ్‌లోనూ కారు కొనుగోలుపై చర్చ కొనసాగింది.

సమాచారం లేకుండానే..

జిల్లాలో వివిధ శాఖల నుంచి టీఎన్జీవోస్‌లో 10,473 మంది సభ్యత్వం కలిగి ఉన్నారు. ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలలో ఒక్కో ఉద్యోగి సభ్యత్వ రుసుము రూపంలో రూ.200 చొప్పున డబ్బులు చెల్లిస్తారు. ఇవే కాకుండా ఎన్టీఆర్ చౌరస్తాలోని సంఘ భవనంలో కొనసాగుతున్న హోటల్, ఇతర దుకాణాల నుంచి నెలకు అద్దె రూపంలో రూ.4 లక్షల ఆదాయం సమకూరుతోంది. కాగా, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు రెండు నెలల క్రితం టీఎన్జీవోస్ నిధులు రూ. 34 లక్షలతో నూతన కారును కొనుగోలు చేశారు. మొదట రూ.9 లక్షలు చెల్లించి, మిగతా డబ్బులను విడతల వారీగా చెల్లింపులకు నిర్ణయించారు. దీని ప్రకారం నెలకు రూ. 40వేలు టీఎన్జీవోస్ నుంచి చెల్లిస్తున్నారు. కాగా, ఈ విషయమై ఉద్యోగులకు ముందస్తు సమాచారం ఇవ్వలేదు. తీరా కొనుగోలు చేసిన తర్వాత తెలపడంతో ఉద్యోగులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. ఇదే విషయమై రాష్ట్ర నాయకుడొకరు అధ్యక్షుడిని ప్రశ్నించగా ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. కాగా, రాష్ట్రంలోని ఏ జిల్లాలో కూడా టీఎన్జీవోస్ సొంత కారు కొనుగోలు చేయకుండా, కేవలం నిజామాబాద్‌లోనే కారు ఎలా కొనుగోలు చేస్తారని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

నన్నే ప్రశ్నిస్తారా?

కారు కొనుగోలు విషయమై ఉద్యోగులు ప్రశ్నించడంపై అధ్యక్షుడు పలుమార్లు సమావేశంలో హెచ్చరించినట్లు తెలిసింది. రాష్ట్ర నాయకుల అనుమతి తీసుకొని కారు కొనుగోలు చేశానని, దీనిపై ఉద్యోగులు ప్రశ్నించొద్దని వార్నింగ్ ఇచ్చినట్లు సమాచారం. దీంతో కార్యవర్గం మొత్తం రాష్ట్ర నాయకులను కలిసి ఫిర్యాదు చేసి చర్యలు తీసుకునే వరకు ఊరుకోమని పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా టీఎన్జీవోస్ నిబంధనల ప్రకారం ఈసీ తీర్మానం లేకుండా అధ్యక్ష, కార్యదర్శులు ఎలాంటి కొనుగోళ్లు, ఖర్చులు చేయొద్దు. కానీ, ప్రస్తుతం టీఎన్జీవోస్‌లో కొనుగోలు, ఖర్చు చేసిన తర్వాతే సమావేశాల్లో వివరాలు వెల్లడిస్తున్నారు. లిఖిత పూర్వకంగా ఖర్చుల వివరాలు అందించకపోవడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు.

క్లుప్తంగా

19న సప్లిమెంటరీ పరీక్షలపై సమావేశం

నిజామాబాద్అర్బన్: నగరంలో ఖిల్లా జూనియర్ కళాశాలలో ఈనెల 19న ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్ విద్యాశాఖ అధికారి రవి కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో జరుగనున్న ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల నిర్వహణకు సంబంధించి ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. అధికారులు, సిబ్బంది సమావేశానికి సకాలంలో హాజరు కావాలని ఆయన తెలిపారు.

దోస్త్ సహాయ కేంద్రం ఏర్పాటు

నిజామాబాద్అర్బన్: నగరంలోని గిరిరాజ్ కళాశాలలో డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి 'దోస్త్' సహాయ కేంద్రం ఏర్పాటు చేసినట్లు ప్రిన్సిపాల్ రాంమోహన్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు ఆన్‌లైన్‌లో దోస్త్ ద్వార డిగ్రీ కోర్సులలో ప్రవేశాలు పొందవచ్చు అన్నారు. కళాశాలలో 1860 సీట్లు వివిధ కోర్సుల్లో ఉన్నాయన్నారు.

నల్లమట్టి రవాణా అడ్డగింత



మోపాల్: మండలంలోని మంచిప్ప పెద్ద చెరువు నుంచి తరలిస్తున్న నల్లమట్టి రవాణాను శనివారం గ్రామస్తులు అడ్డుకున్నారు. చెరువులో ఇష్టారీతిన చేపట్టిన తవ్వకాల వల్ల పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలు జరిగే అవకాశముందని వారు ఆరోపించారు. తక్కువ లోతుతో తవ్వకాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అధిక లోడ్‌తో మట్టిని తరలించడం వల్ల రోడ్లు ధ్వంసం అవుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నల్లమట్టి తరలిస్తున్న వాహనాలను అడ్డుకుని అధికారులకు ఫిర్యాదుచేశారు.

నవీపేట మండలంలో సైబర్ మోసం

నవీపేట: మండలంలోని పొల్గా గ్రామానికి చెందిన ఓ వ్యక్తి సైబర్ మోసానికి గురైనట్లు తెలిసింది. సదరు వ్యక్తికి రెండు రోజుల కిందట గుర్తుతెలియని వ్యక్తి ఫోన్ చేసి.. బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నట్లు నమ్మించాడు. మీ ఫోన్ నంబరు వేరే వ్యక్తి ఖాతాకు లింకై ఉందని, ఇలా జరిగితే జైలు శిక్ష పడుతుందని భయపెట్టించాడు. తమకు డబ్బు పంపితే శిక్ష పడకుండా చూస్తామన్నారు. వెంటనే బాధిత వ్యక్తి ఈనెల 15న కొంత డబ్బును పంపించాడు. మళ్లీ శనివారం ఫోన్ చేసి మరింత డబ్బు పంపాలని బెదిరించడంతో రూ.28వేలు పంపించాడు. ఇలా ఇప్పటి వరకు రూ.లక్షా ఇరవై వేలు ఆన్‌లైన్‌లో పంపించాడు. అనుమానం వచ్చిన సదరు వ్యక్తి కుటుంబ సభ్యులకు తెలుపగా మోసపోయినట్లు తెలుసుకున్నాడు. పోలీసులను సంప్రదించి ఫిర్యాదు చేశాడు.

వరి కొయ్యలను కాల్చొద్దు

- పంటపొలాల్లో నిప్పు పెట్టడంతో దెబ్బతింటున్న భూసారం
- పంట దిగుబడిపై ప్రభావం
- పొలాన్ని కలియ దున్నితేనే మేలు
- రమ్య రాథోడ్, రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త



కోటగిరి శివారులో వరి కోతల అనంతరం కొయ్యలను కాల్చివేస్తున్న దృశ్యం



రమ్య రాథోడ్, వ్యవసాయ శాస్త్రవేత్త

రుద్రూర్: వరి కోతల అనంతరం మిగిలిన అవశేషాలను (కొయ్యలను) కాల్చొద్దని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కాలుష్యం పెరగడంతో పాటు విలువైన సూక్ష్మరాశి నశిస్తుందని, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్ వంటి హానికర వాయువులు కొన్ని మిలియన్ టన్నులు గాలిలోకి చేరి కాలుష్యం పెరిగిపోతుందని రుద్రూర్ వ్యవసాయ పరిశోధన కేంద్రం శాస్త్రవేత్త రమ్య రాథోడ్ అన్నారు. ఈమేరకు రైతులకు ఒక ప్రకటనలో పలు సూచనలు, సలహాలు చేశారు. రైతులు పంట అవశేషాలను కాల్చివేయకుండా సరైన విధానంలో కుళ్ల బెట్టుకోవడం వల్ల పంటకి పోషకాలు అందించడంతోపాటు ప్రకృతిలో విడుదలయ్యే విషవాయువులను తగ్గించవచ్చు.

ఇలా ఉపయోగించాలి..

మిషిన్‌తో వరి కోతలు కోయడం వల్ల సుమారుగా ఒకటిన్నర నుంచి రెండు టన్నుల గడ్డి ఎకరానికి పొలంలోనే ఉండిపోతుంది. దాన్ని త్వరగా కుళ్ల పెట్టే విధానాన్ని అవలంభిస్తే అది బాగా కుళ్లుతుంది. కానీ దాన్ని తగలపెట్టేసి తర్వాత దాన్ని దమ్ము చేస్తున్నారు. సుమారుగా ఒక ఎకరానికి ఒకటిన్నర నుంచి రెండు టన్నుల గడ్డిని తగల పెట్టడం వల్ల పంటకి అనేక పోషకాలు అందకుండా పోవటంతో పాటు పర్యావరణానికి తీవ్రమైన నష్టాన్ని కలుగుతుంది. కోతల అనంతరం వరిగడ్డిని పశువుల మేతగా వాడుకోవాలి. లేదా సేంద్రియ పదార్థంగా తిరిగి భూమికి అందించాలి.

కలియదున్నడంతో లాభాలు..

పొలంలో కొద్దిమేర ఉన్న ఎరువులు (నత్రజని, భాస్వరం , పొటాష్), సూక్ష్మ పోషకాలు భూమిలో కలియ దున్నిన తర్వాత దాదాపు 30 నుంచి 90 రోజుల మధ్య దాంట్లో ఉన్న పోషకాలు అందుతాయి. దీంతో తదుపరి పంటలకు వేయాల్సిన పోషకాలను 25 నుంచి 30 శాతం వరకు తగ్గించుకోవచ్చు. ఎరువుల మీద సాగు ఖర్చు కూడా తగ్గుతుంది. పొలంలో తగలపెట్టకుండా మూడు నుంచి ఐదేళ్లు ఏకధాటిగా దమ్ము చేయటం వల్ల సేంద్రియ కార్బన శాతం కూడా గణనీయంగా పెరిగే ఆస్కారం ఉంటుంది. ఇలా చేస్తే సాగు ఖర్చు తగ్గడంతో పాటు భూసార పరిరక్షణ జరుగుతుంది.

దమ్ము చేసే విధానం..

పొలంలో నీళ్లు పెట్టి దాన్ని కేజ్ వీల్స్ లేదా రోటవేటర్‌తో ఒకసారి దమ్ము చేసిన తర్వాత ఎకరానికి 50 కిలోల సూపర్ ఫాస్పేట్‌తోపాటు 10 నుంచి 15 కిలోల యూరియా కలిపి వేయాలి. మళ్లీ మూడు నాలుగు రోజుల తర్వాత దమ్ము చేసి వారం వ్యవధిలో ఆఖరి దమ్ము చేసినట్లయితే పంటకి మేలు చేసే సూక్ష్మ జీవుల సంఖ్య గణనీయంగా వృద్ధి చెందుతాయి. అలాగే గడ్డి వేగంగా కుళ్లిపోతుంది. ఇలా కాకుండా మార్కెట్లో వరిగడ్డి కుళ్లడానికి వివిధ డీకంపోజర్లు అందుబాటులో వచ్చాయి. ఈ డీకంపోజర్ ఉపయోగించడం వల్ల బాగా సులువుగా వరిగడ్డి కుళ్లిపోయి త్వరగా పొలానికి పోషకాలు అందించవచ్చు.

డీకంపోజర్ ఉపయోగించే విధానం..

- పూసా డీకంపోజర్: ఐదు లీటర్ల నీటిలో 250 గ్రాముల బెల్లాన్ని బాగా మరిగించాలి. ఈ ద్రావణం చల్లార్చిన తర్వాత 50 గ్రాముల శెనగ పిండి, రెండు పూస డీకంపోజర్ బిళ్లలు కలిపేసి ఈ ద్రావణాన్ని నాలుగు నుంచి ఐదు రోజులు నిల్వ ఉంచాలి. దీంతో అందులో ఉన్నటువంటి సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. తయారైన 5 లీటర్ల పూసా డీకంపోజర్ ద్రావణాన్ని 200 లీటర్ల నీటిలో కలపాలి.ఈ ద్రావణాన్ని పొలంలో సమానంగా పిచికారి చేస్తే గడ్డి బాగా కుళ్లిపోయి అందులో ఉన్న పోషకాలుభూమికి లభ్యమవుతాయి.
- ఘాజియాబాద్ డీకంపోజర్: 200 లీటర్ల నీటిని తీసుకుని అందులో రెండు కిలోల పొడర్ చేసిన బెల్లాన్ని వేసి కర్రతో బాగా కలుపుకోవాలి. అందులో ఒక ప్యాకెట్ ఘాజియాబాద్ డీకంపోజర్ వేసి బాగా కలపాలి. ఈ ద్రావణాన్ని ఒకటి రెండు రోజులు నిల్వ ఉంచి పొలంలో సమానంగా పిచికారి చేస్తే 10 నుంచి 15 రోజుల్లో సూక్ష్మజీవులు విపరీతంగా పెరిగి గడ్డి బాగా కుళ్ళిపోతుంది. రైతులు పంట అవశేషాలనును కాల్చివేయకుండా సరైన విధానంలో కుళ్ల బెట్టుకోవడం వలన పంటకి పోషకాలు అందించడంతో పాటుగా ప్రకృతిలో విడుదలయ్యే విషవాయువులను తగ్గించవచ్చునని ఆమె వివరించారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ట్రాన్స్‌పోర్టు శాఖ అధికారులు

బోధన్‌టౌన్(బోధన్): రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ప్రతిఒక్కరూ కృషి చేయాలని, వాహనాలు నడిపేటప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలని ట్రాన్స్‌పోర్ట్ జిల్లా అధికారి ఉమామహేశ్వర్‌రావ్ అన్నారు. పట్టణంలోని ఇందూర్ హైస్కూల్‌లో శనివారం ట్రస్మా ఆధ్వర్యంలో ట్రాన్స్‌పోర్ట్, అగ్నిమాపక శాఖ, ట్రాఫిక్ శాఖలు సంయుక్తంగా రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను మాక్ డ్రిల్ చేసి చూపించారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నియంత్రణ చర్యలను వివరించారు. అనంతరం ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల కరపత్రాలను ఆవిష్కరించారు. ఎంవీఐ శ్రీనివాస్, ట్రాఫిక్ సీఐ చందర్ రాథోడ్, అగ్నిమాపక శాఖ అధికారి సుభాష్, ఎంఈవో నాగయ్య, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కోడాలి కిశోర్‌కుమార్, పట్టణ అధ్యక్షుడు హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నగరంలో ఫుట్ పెట్రోలింగ్



ఖలీల్‌వాడి: నగరంలోని అహ్మదీబజార్, తదితర ప్రాంతాల్లో శనివారం డాగ్‌స్క్వాడ్‌తో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించినట్లు ఎస్సై సయ్యద్ ఇమ్రాన్ తెలిపారు. ఈసందర్భంగా పోలీసు సిబ్బంది పాన్ షాపులు, హోటళ్ల వద్ద తనిఖీలు చేపట్టారు.

ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే వరకు పోరాటం చేద్దాం



మాట్లాడుతున్న మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య

నిజామాబాద్‌నాగారం: ఎస్సీ వర్గీకరణ రద్దయ్యే వరకు న్యాయ పోరాటం చేద్దామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని కేసీఆర్ కాలనీలోగల ఓ ఫంక్షన్‌హాల్‌లో శనివారం మాలమహానాడు జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా చెన్నయ్య హాజరై మాట్లాడారు. మనమందరం ఐక్యంగా ఉండి కోర్టు ద్వారా ఎస్సీ వర్గీకరణ రద్దు అయ్యేవరకు న్యాయ పోరాటం చేయాలన్నారు. అందుకు ప్రతి మాల సోదరుడి నైతిక సహాయం అవసరం ఉందని తెలిపారు. నిర్మల్ జిల్లా ముథోల్ మండల బోరేగంలో బుద్ధ పూర్ణమి రోజున బుద్ధ భగవాన్ విగ్రహం పెట్టినందుకు దళితులపై అగ్రకులాల వారు దాడి చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దాడికి పాల్పడ్డవారిపై పోలీస్ కేసులు పెట్టి చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు బూర్గుల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎడ్ల నాగరాజు, ఎల్లయ్య, జిల్లా నూతన అధ్యక్షుడు చొక్కం దేవిదాస్, టీమ్ కన్వీనర్ అలుక కిషన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నాంది వినయ్ కుమార్, కోశాధికారి రాజన్న, ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు స్వామిదాస్ తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులను గుర్తించి బడుల్లో చేర్పించాలి



ప్రత్యేక ఉపాధ్యాయుల శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న డీఈవో అశోక్

నిజామాబాద్ అర్బన్: ప్రత్యేక ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థులను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖ అధికారి అశోక్ అన్నారు. సమగ్ర శిక్ష సహిత విద్యా విభాగం ఆధ్వర్యంలో కరిక్యులార్ అండ్ థెరపిక్ స్ట్రాటజీస్ ఫర్ సీడబ్ల్యూఎస్ఎన్ (చైల్డ్ విత్ స్పెషల్ నీడ్) అనే అంశంపై ఐదు రోజుల శిక్షణ కార్యక్రమం శనివారం ముగిసింది. ఈసందర్భంగా ముగింపు కార్యక్రమాన్ని నగరంలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 29 భవిత కేంద్రాల్లో విద్యనభ్యసిస్తున్న దివ్యాంగ విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరంలో రూ.26 లక్షలు ఎంటైటిల్మెంట్ అందజేశామన్నారు. ప్రతీ ఉపాధ్యాయుడు 21 వైకల్యాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. దివ్యాంగులకు ప్రభుత్వం నుంచి అందే అవకాశాలను వారికి చేర్చాల్సిన బాధ్యత స్పెషల్ టీచర్స్‌పై ఉంటుందన్నారు. దివ్యాంగులకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడం ద్వారా సాధారణ విద్యార్థులతో సమానంగా వారు విజయాలు సాధిస్తారన్నారు. జిల్లా కో–ఆర్డినేటర్ పడకంటి శ్రీనివాస్‌రావ్, డీఆర్పీలు మురళి, మమత, ప్రకాష్, రాజన్న, శ్రీనివాస్, ఐఈఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలి



రిసోర్స్ పర్సన్లను సన్మానిస్తున్న డీఈవో అశోక్

మోపాల్(నిజామాబాద్‌రూరల్): ఉపాధ్యాయులు శిక్షణలో నేర్చుకున్న అంశాలను వచ్చే విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని డీఈవో అశోక్ సూచించారు. నగరశివారులోని బోర్గాం(పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఐదురోజులుగా జరుగుతున్న మొదటి బ్యాచ్ ఉపాధ్యాయుల శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. ఈసందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరిగే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలని, స్పష్టమైన అవగాహనతో విద్యా బోధన చేయాలని సూచించారు. సెంటర్ ఇన్‌చార్జి శంకర్ మాట్లాడుతూ.. సబ్జెక్టు వారీగా లెర్నింగ్ అవుట్ కమ్స్‌పై అవగాహన ఉండాలని, ఈ శిక్షణ ఔట్ కమ్స్ వివరాలు అందించినట్లు తెలిపారు. అలాగే వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. అనంతరం రిసోర్స్‌పర్సన్లను డీఈవో సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

జంక్ ఫుడ్, నిల్వ ఆహారాన్ని తీసుకోవద్దు

- జీవనశైలి మార్పులతోనే అధిక రక్తపోటు నియంత్రణ
- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్
- నగరంలో ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవం

నిజామాబాద్‌నాగారం: ప్రజలు నిల్వ ఆహార పదార్థాలను, బేకరి, జంక్ ఫుడ్స్ వాడొద్దని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో తుకారాం రాథోడ్ సూచించారు. ప్రతిఒక్కరూ జీవనశైలీ మార్పులతోనే అధిక రక్తపోటు నియంత్రణలో ఉంటుందని అన్నారు. నగరంలోని అర్సపల్లి పట్టణ ఆరోగ్య కేంద్రంలో శనివారం ప్రపంచ అధిక రక్తపోటు నియంత్రణ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

అనంతరం నగరంలోని జిల్లా శిక్షణ కేంద్రం పీవోడీటీటీలో వైద్య సి బ్బందికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక రక్తపోటు నివారణకు ప్రతి ఒక్కరూ ఉప్పు వాడకాన్ని తగ్గించాలని ఆహారాన్ని పరిమిత స్థాయిలో తీసుకోవాలన్నారు. నిత్యం వ్యాయామం, నడక, యోగా, ప్రాణయామం లాంటివి చేయాలన్నారు. వైద్యాధికారులు అంజన, సామ్రాట్ యాదవ్, అజ్మతున్నిసా బేగం, వెంకటేష్, రాజేశ్వర్, ఘన్పూర్ వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, గోవర్ధన్ పాల్గొన్నారు.



నగరంలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ అధికారులు, ఉద్యోగులు

అల్ప్రాజోలం పట్టివేత



బోధన్ మండలంలోని బెల్లాల్‌లో పట్టుకున్న అల్ప్రాజోలం, నిందితుడితో ఎక్సైజ్ పోలీసులు

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ మండలంలోని బెల్లాల్ గ్రామంలో 264 గ్రాముల అల్ప్రాజోలం పట్టుకున్నట్లు ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు బెల్లాల్ గ్రామంలోని ముస్తాబాద్ వీరగౌడ్ ఇంట్లో సోదాలు నిర్వహించగా అల్ప్రాజోలం లభించిందని, వెంటనే వీరగౌడ్‌ను అదుపులోకి తీసుకొని, సరుకును స్వాధీనం చేసుకున్నామన్నారు. తదుపరి చర్యల నిమిత్తం బోధన్ ఎక్సైజ్ కార్యాలయానికి అప్పగించినట్లు తెలిపారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్లు ఎక్సైజ్ సీఐ భాస్కర్‌రావ్ తెలిపారు. ఈ సోదాల్లో సబ్ ఇన్‌స్పెక్టర్ నరసింహ చారీ, రామ్‌కుమార్, సిబ్బంది రామ్ బచ్చన్, గంగారాం, సాయికుమార్‌లు ఉన్నారు.

ఒకరిపై కేసు నమోదు

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని పర్మళ్ల గ్రామానికి చెందిన లెగ్గల రాజు అనే యువకుడిపై శుక్రవారం రాత్రి కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు. సదరు యువకుడు ముస్తాపూర్ గ్రామానికి చెందిన ఓ వివాహిత పట్ల అసభ్యకరంగా ప్రవర్తించి, వేధింపులకు గురిచేసినట్లు తెలిపారు. దీంతో వివాహిత పోలీసులకు ఫిర్యాదు చేయగా, పలు సెక్షన్ల కింత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న అడవిపంది: ఒకరి మృతి



పోచయ్య (ఫైల్)

నవీపేట: మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులో బైక్‌పై వెళుతున్న ఓ వ్యక్తిని అడవి పంది ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామానికి చెందిన సుంకరి పోచయ్య(46) శుక్రవారం మండల కేంద్రంలో జరిగిన వారాంతపు కూరగాయల సంతకు వచ్చాడు. రాత్రి సమయంలో బైక్‌పై తిరిగి సొంతూరికి బయలుదేరాడు. మండలంలోని అబ్బాపూర్(ఎం) శివారులో అడవి పందుల గుంపు రావడంతో అతడి బైక్‌ను ఓ అడవి పంది ఢీకొట్టింది. దీంతో అతడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే స్థానికులు గమనించి అతడిని ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వినయ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు..



భిక్కనూరు: మండలంలోని జంగపల్లి గ్రామశివారులోగల జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూరు మండల కేంద్రానికి చెందిన బచ్చుగారి క్రిష్ణమూర్తి (48) శనివారం వ్యక్తిగత పనుల మీద బైక్‌పై రాజంపేటలోని అత్తగారింటికి వెళ్లాడు. కొంత సమయానికి తిరిగి బైక్‌పై భిక్కనూరుకు బయలుదేరగా, జంగంపల్లి శివారులో అతడి బైక్‌ను గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ఘటనలో అతడు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి అతడిని వెంటనే కామారెడ్డి ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.

కూతురిపై తండ్రి లైంగికదాడి

ఖలీల్‌వాడి: నగరంలోని భారతీరాణికాలనీకి చెందిన ఓ వ్యక్తి (68) తన కూతురు(28)పై లైంగిక దాడికి పాల్పడినట్లు ఎస్సై గంగాధర్ శనివారం తెలిపారు. ఈ ఘటనపై బాధితురాలు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

పేకాడుతున్న 14మంది అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైకులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండలంలోని సంగం గ్రామంలో పేకాట ఆడుతున్న 14 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై అరుణ్ కుమార్ శనివారం తెలిపారు. విశ్వసనీయ సమాచారం రావడంతో ఎస్సై వెంటనే తమ సిబ్బందితో పేకాట స్థావరంపై దాడి చేశారు. పేకాడుతున్న వారిని పట్టుకొని, వారి వద్ద నుంచి 8 బైకులను, రూ.4500 నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. కానిస్టేబుల్ రమేష్, శ్రీధర్, గౌరి ఉన్నారు.

గంజాయి తాగిన వ్యక్తి అరెస్టు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): గంజాయి తాగిన ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్సై యాదగిరి గౌడ్ తెలిపారు. మండలకేంద్రంలో శనివారం ప్రొబేషనరీ ఎస్సై శైలేందర్ సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీలు చేపట్టగా, శ్రీరాం నగర్ తండాకు చెందిన భామన్ బహదూర్ సింగ్ బైక్‌పై వెళుతుండగా ఆపి తనిఖీ చేశారు. అతడు గంజాయి తాగినట్లు గుర్తించి, పట్టుకున్నారు. బైక్‌లో ఉన్న 45 గ్రాముల గంజాయిని, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు తెలిపారు. సిబ్బందిని పోలీస్ ఉన్నతాధికారులు, సౌత్ రూరల్ సీఐ సురేష్‌కుమార్ అభినందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



నందిపేట్(ఆర్మూర్): మండలంలోని తల్వేద గ్రామ సమీపంలోని గోదావరి నది పరివాహక ప్రాంతం నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై చిరంజీవి శనివారం తెలిపారు. మండలంలోని చింరాజ్‌పల్లి గ్రామ సమీపంలో తనిఖీలు చేపడుతుండగా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లు కనిపించడంతో వాటిని పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించామన్నారు. ఇసుక ట్రాక్టర్ల డైవర్లపై కేసు నమెదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నాడు.

నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు

ఖలీల్‌వాడి: నగరంలోని బోధన్ రోడ్డులో ఫస్ట్ ఎయిడ్ సెంటర్ నడిపిస్తున్న నకిలీ డాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి శనివారం తెలిపారు. మేకల రాకేష్ అనే వ్యక్తి విజిలెన్స్ ఆఫీసర్‌కు ఫిర్యాదు చేయగా, అధికారులు ఇటీవల ఆస్పత్రిలో తనిఖీ చేశారు. ఆస్పత్రి నిర్వాహకుడు ఎలాంటి డాక్టర్ పట్టా లేకుండా రోగులకు వైద్యం అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు.

పసిబిడ్డతో కలిసి మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

బాన్సువాడ: బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో శనివారం ఓ మహిళ పసిబిడ్డతో కలిసి ఆత్మహత్యకు యత్నించగా, పోలీసులు అడ్డుకొని కాపాడారు. మండలంలోని కోనాపూర్ గ్రామానికి చెందిన ఓ మహిళ పసిబిడ్డతో వచ్చి కల్కి చెరువులోకి దూకే ప్రయత్నం చేసింది. స్థానికులు గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు వచ్చి వారిని కాపాడారు. సదరు మహిళకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

ఆత్మహత్యకు యత్నించడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఏఎస్సై విజయ్, కానిస్టేబుళ్లు ప్రవీణ్, సౌజన్య, నవీన్, అంజయ్య, శ్రీనివాస్‌లు ఉన్నారు.

'మీ సేవా' అసోసియేషన్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లక్ష్మీనారాయణ



నిజామాబాద్ అర్బన్: తెలంగాణ మీ సేవా ఆపరేటర్స్ అసోసియేషన్ ప్రమాణ స్వీకారం శనివారం హైదరాబాద్‌లో నిర్వహించారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లాకు చెందిన కే లక్ష్మీనారాయణ, రాష్ట్ర జాయింట్ సెక్రటరీగా మహమ్మద్ నాసిర్ అహ్మద్ నియమితులయ్యారు. వీరిని రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల జీవన్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి కిరణ్, కోశాధికారి జీ శ్రీకాంత్ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో మీ సేవా ఆపరేటర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారులు, ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో చింత రాజు, ముజాహిదుద్దీన్ అన్సారీ, గోపాల్, సంతోష్ పాల్గొన్నారు.

డిగ్రీ పరీక్షల్లో ఒకరు డిబార్

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ సెమిస్టర్ పరీక్షలు కొనసాగుతున్నాయి. శనివారం ఆర్మూర్ నరేంద్ర డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో మాల్‌ప్రాక్టీస్‌కు పాల్పడుతూ ఓ విద్యార్థి డిబార్ అయినట్లు ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘంటా చంద్రశేఖర్ తెలిపారు. ఉదయం నిర్వహించిన పరీక్షలకు 6,896 మందికి గాను 6,339 మంది హాజరు కాగా 557 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారన్నారు. అలాగే మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షలకు 6,110 మందికి గాను 5,641మంది హాజరు కాగా 468 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు వివరించారు. నిజామాబాద్, ఆర్మూర్‌లోని పలు పరీక్షాకేంద్రాలను తెయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ కే.సంపత్ కుమార్‌తో కలిసి ఆడిట్ సెల్ డైరెక్టర్ చంద్రశేఖర్ తనిఖీ చేశారు. కామారెడ్డిలోని పరీక్షా కేంద్రాలను ప్రత్యేక స్క్వాడ్ బృందాలు తనిఖీ చేశాయి.